నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 కరీంనగర్, సోమవారం 23 డిసెంబర్ 2024 KARIMNAGAR

## అటవీ భూముల ఆక్రమణను అడ్డుకోండి




ఆత్మకూర్ శివారులో ఆక్రమణకు గురైన అటవీ భూముల వద్ద ఆందోళన చేపడుతున్న గ్రామస్తులు

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 22: ఆత్మకూర్ శివారులో అటవీ భూముల ఆక్రమణను అడ్డుకోవాలని గ్రామస్తులు ఆదివారం ఆందోళన చేపట్టారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. అంతకుముందు గ్రామస్తులంతా సమావేశమై, ఆక్రమణకు గురవుతున్న అటవీ భూముల వద్దకు తరలివెళ్లారు. ఆక్రమించిన భూముల్లో విద్యుత్ స్తంభాలు వేయడంతో పాటు తీగలను సైతం అమర్చి ఉండడాన్ని గుర్తించి, ఈ విషయాన్ని అటవీశాఖ అధికారులు, పోలీసులకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. పోలీసులు, అటవీ అధికారులు అక్కడికి చేరుకొని విద్యుత్ స్తంభాలు వేసి ఉండడాన్ని గుర్తించారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆక్రమణను అడ్డుకుంటామని తెలపడంతో గ్రామస్తులు వెనుతిరిగారు. ఇక్కడ గ్రామాభివృద్ధి కమిటీ సభ్యులు ఉన్నారు.

### అంజన్న ప్రసాదాల తయారీ ఇన్‌చార్జికి మెమో

మల్యాల, డిసెంబర్ 22 : కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం ప్రసాదాల తయారీ కేంద్ర ఇన్‌చార్జి జెమిని శ్రీనివాస్‌కు ఈవో రామకృష్ణారావు ఆదివారం మెమో జారీ చేశారు. హైదరాబాద్‌కు చెందిన ఓ భక్తుడికి 200 గ్రాముల పులిహోర స్థానంలో 170 గ్రాములు మాత్రమే రావడంతో ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశాడు. ఈ క్రమంలో శ్రీనివాస్‌కు మెమో జారీచేయడంతోపాటూ సంజాయిషీని లిఖిత పూర్వకంగా అందజేయాలని ఈవో ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

## నైపుణ్య వేదిక..
# యువతకు వెలుగు దీపిక




శిక్షణ పొందుతున్న విద్యార్థులు

- కేసీఆర్ ప్రభుత్వం చొరవతో కరీంనగర్‌లో సిఐటీడీ ఏర్పాటు
- పలు కోర్సుల్లో సాంకేతిక నైపుణ్యాలపై శిక్షణ
- అందుబాటులోకి వచ్చిన కేంద్రం
- కొనసాగుతున్న తరగతులు

గ్రామీణ విద్యార్థులను పట్టణ ప్రాంత విద్యార్థులకు ధీటుగా తీర్చిదిద్దుతున్నది సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ కేంద్రం(సీఐటీడీ). కేసీఆర్ ప్రభుత్వ హయాంలో కరీంనగర్ జిల్లా కేంద్రంలో అన్ని హంగులతో రూపుదిద్దుకోగా, కొన్ని నెలల కిందటే పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చింది. అత్యాధునిక సౌకర్యాలున్న ఈ కేంద్రంలో శిక్షణ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అందుబాటులో ఉన్న కోర్సులు, అర్హతలు, వాటిలో ప్రవేశం పొందే విధానం, శిక్షణ తర్వాత విద్యార్థులకు అందించే సేవలు, ఇతర అంశాలపై ప్రత్యేక కథనం.

- కరీంనగర్ ముకరంపుర, డిసెంబర్ 22



సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ కేంద్ర భవనం

హైదరాబాద్ తర్వాత కరీంనగర్ వేగంగా విస్తరిస్తున్నది. విద్య, వైద్య సంస్థలతోపాటు ఇంజినీరింగ్, డిప్లొమా కళాశాలలు, పారిశ్రామిక శిక్షణ కేంద్రాలు ఉన్నాయి. అయితే, వీటన్నింటి నుంచి ఏటా వేలాదిమంది పట్టాలతో బయటకు వస్తున్నారు. కానీ, సరైన నైపుణ్యం కొరవడి చదువుకు తగ్గ ఉద్యోగాలు సాధించలేక విఫలవుతున్నారు. ఈ నేపథ్యంలో యువతకు సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టూల్ డిజైన్ వివిధ అంశాల్లో నైపుణ్యాన్ని పెంపొందించి సుశిక్షితులుగా తీర్చిదిద్దుతున్నది. హైదరాబాద్ కేంద్రానికి అనుబంధంగా జిల్లా కేంద్రంలో సీఐటీడీ విస్తరణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. కేసీఆర్ ప్రభుత్వం ఈ సెంటర్ ఏర్పాటుకు అన్ని విధాలుగా కృషి చేసింది. శాతవాహన యూనివర్సిటీ ఫార్మసీ కాలేజీ ప్రాంగణంలో కేటాయించిన 1.20 ఎకరాలలో ఆధునిక సౌకర్యాలతో భవనాలు నిర్మించారు. కొద్ది రోజుల క్రితం పూర్తి స్థాయిలో కేంద్రం అందుబాటులోకి రావడంతో శిక్షణా కార్యక్రమాలు మొదలయ్యాయి. మ్యాను ఫ్యాక్చరింగ్‌తోపాటు వివిధ విభాగాల్లో శిక్షణ పొందిన వారికి విస్తృతమైన ఉపాధి అవకాశాలు తలుపు తడుతున్నాయి. బహుళ జాతి సంస్థలు ఇక్కడ శిక్షణ పొందిన వారికి ఉద్యోగాలు ఇవ్వడానికి ప్రాధాన్యత ఇస్తున్నాయి. కొంత మంది సొంతంగా పరిశ్రమలు ఏర్పాటు చేస్తూ ఉపాధి కల్పించే స్థితికి చేరుకున్నారు.

### అందుబాటులో ఉన్న కోర్సులు-అర్హతలు

ఇంజినీరింగ్, డిప్లొమా, ఐటీఐ కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులు సీఐటీడీ లో శిక్షణ పొందడానికి అర్హులు. విద్యార్థులు ఎంచుకున్న కోర్సును బట్టి నిర్ణీత ఫీజును వసూలు చేస్తారు. కొన్ని కోర్సుల్లో శిక్షణ వ్యవధి నెల రోజులు ఉండగా మరికొన్ని కోర్సులకు 96 గంటల పాటు శిక్షణ ఇచ్చేలా రూపకల్పన చేశారు. ఇందులో కొన్ని కోర్సులు నేషనల్ స్కిల్స్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్ వర్క్స్(NSQF)కింద ఉన్నాయి. ఇందులో మ్యాట్ ల్యాబ్ (ఈఈఈ, ఈసీఈ, మెకానికల్, సీఎస్ఈ, ఐటీ ఇంజినీరింగ్), ఆటో క్యాడ్-2డీ, 3డీ(ఐటీఐ సంబంధిత ట్రేడ్ లో అనుభవం, డిప్లొమా, డిగ్రీ(మెకానికల్ ఇంజినీరింగ్ తత్సమాన అర్హత), సీఆర్ఈవో పారామెట్రిక్ డిప్లొమా, డిగ్రీ(మెకానికల్ ఇంజినీరింగ్ తత్సామాన అర్హత), సాలిడ్ వర్క్స్(డిప్లొమా, డిగ్రీ(మెకానికల్ ఇంజినీరింగ్ తత్సామాన అర్హత) కోర్సులు ఉన్నాయి.

### శిక్షణానంతర సేవలు

- కేంద్రంలో వివిధ కోర్సుల్లో శిక్షణ పొందిన వారికి శిక్షణానంతరం కేంద్రం అండగా నిలుస్తుంది. కెరీర్ గైడెన్స్ రూపంలో చదివిన కోర్సు, శిక్షణ ద్వారా పొందే ఉపాధి అవకాశాలు, స్వయం ఉపాధి మార్గాల గురించి ఎప్పటికప్పుడు తెలియజేస్తారు.
- విద్యార్హతలు, కేంద్రంలో తీసుకున్న శిక్షణతో మెరుగైన ఉపాధి అవకాశాలు పొందడంలో సహాయం అందిస్తారు.
- శిక్షణ పొందిన ప్రతి విద్యార్థికి ఉపయోగ పడేలా సాఫ్ట్ మెటీరియల్‌ను అందిస్తారు.

### శిక్షణతో మెరుగైన నైపుణ్యాలు



సీఐటీడీలో శిక్షణ పొందిన వారికి మంచి భవిష్యత్తు ఉంటుంది. ఇంజినీరింగ్ విద్యార్థులకు వివిధ అంశాల్లో నిపుణులైన బోధనా సిబ్బంది, తరగతి గది బోధనతో పాటు అత్యాధునిక ల్యాబ్‌లో ప్రాక్టీస్ ద్వారా సబ్జెక్ట్, స్కిల్స్‌పై పూర్తి అవగాహన వస్తుంది. బహుళ జాతి సంస్థల్లోనూ సులువుగా కొలువులు పొందేలా శిక్షణ ఉపయోగ పడుతుంది. మాన్యుఫ్యాక్చరింగ్ రంగానికి సంబంధించి రాబోయే రోజుల్లో అత్యాధునిక సీఎన్‌సీ మెషిన్లపై అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేలా ఏర్పాట్లు జరుగుతున్నాయి.

- ఎస్ రామకృష్ణ, అసిస్టెంట్ డైరెక్టర్, సీఐటీడీ, కరీంనగర్

### నాన్ ఎన్ఎస్ క్యూఎఫ్ కోర్సు కింద

- పైథాన్ ప్రోగ్రామింగ్ ఫర్ డాటా అనలిస్టిక్స్(డిప్లొమా, బీటెక్, ఎంటెక్(ఈఈఈ, ఈసీఈ, మెకానిక్, సీఎస్ఈ, ఐటీ) ఉన్నాయి.
- అకాడమిక్ ప్రాజెక్ట్ వర్క్స్, ఇంటర్న్ షిప్(బీఈ, బీటెక్ మెకానికల్ ఇంజినీరింగ్ లేదా తత్సామాన అర్హత-నెల రోజులు కోర్సు వ్యవధి).
- నేషనల్ స్కిల్స్ క్వాలిఫికేషన్ ఫ్రేమ్ వర్క్స్(ఎన్ఎస్ క్యూఎఫ్) కింద కొన్ని ఎంపిక చేసిన కోర్సుల్లో శిక్షణ పొందే విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం ఫీజు చెల్లిస్తుంది. రిజిస్ట్రేషన్ ఫీజు మాత్రం విద్యార్థులు చెల్లించాలి.
- కోర్సులో ప్రవేశం పొందిన వారి హాజరు తప్పనిసరిగా 90 శాతం ఉండాలి. శిక్షణలో ఒక గంట థియరీ తరగతులు 3 గంటలు ల్యాబ్‌లో శిక్షణ ఉంటుంది. ఇప్పటికే పలు బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చారు.
- కోర్సుల్లో శిక్షణ పొందే వారు తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలు, ఐడీ ప్రూఫ్(ఆధార్)తో సీఐటీడీ కార్యాలయంలో సంప్రదించి ప్రవేశం పొందాలి.

### అత్యాధునిక ల్యాబ్

తరగతి గదిలో బోధనతో పాటు ల్యాబ్‌లో సాధన కోసం హైఎండ్ సిస్టమ్స్ అందుబాటులో ఉన్నాయి. ప్రత్యేక సాఫ్ట్ వేర్ ద్వారా విద్యార్థులకు ప్రయోగాత్మక విధానంలో సాధన చేయిస్తారు.

## సీఎం సార్... మా అమ్మానాన్నల
# ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయండి

- ఎస్ఎస్ఏ ఉద్యోగుల దీక్షలో పాల్గొన్న పిల్లలు
- 13వ రోజుకు చేరిన సమ్మె



కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట దీక్షలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న సమగ్ర శిక్షా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు

హౌసింగ్‌బోర్డుకాలనీ, డిసెంబర్ 22: ''సీఎం సార్.. మా అమ్మానాన్నల ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయండి'' అని సమగ్ర శిక్షా ఉద్యోగుల పిల్లలు ఆదివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని వేడుకున్నారు. సమగ్ర శిక్షా ఉద్యోగులు తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ చేపట్టిన సమ్మె 13వ రోజుకు చేరగా, ఆదివారం దీక్షలో వారితో పిల్లలు, కుటుంబ సభ్యులు కూర్చుని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... గతేడాది సెప్టెంబర్ 13న పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి హనుమకొండలోని ఏకశిల పార్క్ వద్ద చేస్తున్న సమగ్ర శిక్షా ఉద్యోగుల దీక్షా శిబిరాన్ని సందర్శించి కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే వందరోజుల్లో సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఆ హామీని వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ దీక్షలో జిల్లా గౌరవాధ్యక్షుడు బెజ్జంకి ఆంజనేయులు, జిల్లా అధ్యక్షుడు గుండా రాజిరెడ్డి, జిల్లాప్రధాన కార్యదర్శి మహేశ్, జిల్లా ఉపాధ్యక్షులు రమేష్, రవిచంద్ర, బీ శ్రీకాంత్, కేజీబీవీ ప్రత్యేకాధికారులు ఎం అజిత, బీ రమాదేవి, ఎన్ పూర్ణిమ గౌతమి, పీ మాధవి, పీ కిరణ్ జ్యోతి, ఎం స్వప్న, ఏ సునీత, పీ కవిత, వై భార్గవి, ఇ లావణ్య, కే సుప్రియ, కే రజిత, జీ పుష్కరాణి, కే మధులత, తదితరులు పాల్గొన్నారు.



భరోసా కేంద్రం శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న డీజీపీ డాక్టర్ జితేందర్, ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రేమా రాజేశ్వరి, సీపీ అభిషేక్ మొహంతి, ట్రైనీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫారెబి, అధికారులు

## మహిళకు అండగా 'భరోసా' కేంద్రం

డీజీపీ డాక్టర్ జితేందర్

రాంనగర్, డిసెంబర్ 22 : భరోసా కేంద్రాలు మహిళలకు అండగా ఉంటాయని డీజీపీ డాక్టర్ జితేందర్ పేర్కొన్నారు. రాష్ట్ర పోలీస్ శాఖ ఉమెన్ సేఫ్టీ వింగ్ ఆధ్వర్యంలో కరీంనగర్ కమిషనరేట్ కోసం కొత్తపల్లి వద్ద భరోసా కేంద్ర నూతన భవనాన్ని శిలాఫలకాన్ని ఆవిష్కరించి ప్రారంభించారు. అంతకు ముందు ఆయనకు సీపీ అభిషేక్ మొహంతి పూల మొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం భరోసా కేంద్రం వద్ద నూతన పోలీస్ సిబ్బంది నుంచి గౌరవ వందనం స్వీకరించారు. తర్వాత బాధిత మహిళలకు సేవలందించేందుకు ఏర్పాటు చేసిన గదులు, వసతులు పరిశీలించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఈ కేంద్రంలో సోమవారం నుంచి సేవలు అందుబాటులోకి రానున్నాయన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని కమిషనరేట్లు, జిల్లాల్లో భరోసా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. తర్వాత మీడియా అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇస్తూ రాష్ట్రంలో నక్సలిజం పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని, సినీ ప్రముఖులు అల్లు అర్జున్ మోహన్‌బాబు విషయాల్లో చట్టం తన పని తాను చేసుకుంటూ ముందుకు పోతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఉమెన్ సేఫ్టీ వింగ్ డీఐజీ రేమా రాజేశ్వరి, ట్రైనీ ఐపీఎస్ యాదవ్ వసుంధర ఫారెబి, అడిషనల్ డీసీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ మాధవి, ఇన్‌స్పెక్టర్ శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగుల సమస్యలపై పోరాడుతా

ఎమ్మెల్సీ అభ్యర్థి వీ నరేందర్ రెడ్డి



బైక్ ర్యాలీలో ఎమ్మెల్సీ అభ్యర్థి వీ నరేందర్ రెడ్డి

మానకొండూర్, డిసెంబర్ 22: తనకు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే నిరుద్యోగుల సమస్యలపై పెద్దల సభలో గళమెత్తుతానని కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి వీ నరేందర్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం మానకొండూర్ మండల కేంద్రంలోని ఓ కన్వెన్షన్ హాల్‌లో జరిగిన మానకొండూర్ నియోజకవర్గ పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళనానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడారు. తనకు అవకాశమిస్తే రాబోయే రోజుల్లో అల్ఫోర్స్ విద్యా సంస్థల తరఫున యువతకు ఉచిత కోచింగ్ శిక్షణ తరగతులు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. ముందుగా స్థానిక అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి భారీ బైక్ ర్యాలీతో కన్వెన్షన్ హాల్‌కు చేరుకున్నారు. కార్యక్రమంలో పట్టభద్రులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

## అటవీ జంతువుల వేటకు వెళ్లి..

- కరెంట్ షాక్‌తో యువకుడు దుర్మరణం
- వన్యప్రాణుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ కంచెకు తగిలి మృతి

మారుతీనగర్, డిసెంబర్ 22: అటవీ జంతువుల వేటకు వెళ్లి, విద్యుత్ కంచె అమర్చి, ప్రమాదవశాత్తూ అదే కంచెకు తగిలి ఓ యువకుడు మృతిచెందిన ఘటన జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలం రాజేశ్వర్‌రావుపేటలో ఆదివారం జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. రాజేశ్వరరావుపేట గ్రామానికి చెందిన జంగిటి నవీన్(32), జంగిటి చిన్న నర్సయ్య శనివారం రాత్రి అటవీ జంతువుల వేట కోసం గ్రామ శివారులోని మామిడితోటకు వెళ్లారు. ఈ క్రమంలో వన్యప్రాణుల కోసం చిన్న నర్సయ్య అలియాస్ ఇచ్చన్న విద్యుత్ కంచెను ఏర్పాటు చేశాడు. ఇది గమనించని జంగిటి నవీన్ అటు వైపు వెళ్లి, తీగలకు తగిలి అక్కడికక్కడే మృతి చెందాడు. నవీన్ భార్య రజిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని ఎస్ఐ అనిల్ దర్యాప్తు చేస్తున్నారు. కాగా, ఘటనాస్థలాన్ని మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి పరిశీలించారు. నవీన్‌కు కొడుకు, కూతురు ఉన్నారు.



గాలన్ చెరువులో మట్టి పోసి నీటికి అడ్డంగా అచ్చుకట్టిన పొలం



చెరువు కట్టపై అనుమతి లేకుండా నరికివేసిన మర్రి చెట్టు

# చెరువు పూడ్చి.. పొలం చేసి!

- దర్జాగా గాలన్ చెరువు కబ్జా
- అధికారులకు ఫిర్యాదు చేసిన గొల్లపల్లి రైతు
- పొలం అచ్చుకట్టే పనులను నిలిపేసిన ఏఈ



రైతును హెచ్చరిస్తున్న ఇరిగేషన్ ఏఈ భాస్కర్‌రెడ్డి

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 22 : మట్టితో ఏకంగా చెరువును పూడ్చేసి పొలం చేసి దర్జాగా కబ్జా చేశారు. చెరువు విస్తీర్ణం తగ్గిపోతుందని ఆందోళన చెందిన ఓ రైతు అధికారులకు ఫిర్యాదు చేయడంతో పొలం అచ్చుకట్టే పనులను ఏఈ నిలిపేశారు. ఈ ఘటన ఎల్లారెడ్డిపేట మండలం గొల్లపల్లిలో ఆదివారం వెలుగు చూసింది. గ్రామంలోని గాలన్ చెరువు కబ్జాకు గురయ్యే ప్రయత్నం జరుగుతున్నదని, అనుమతి లేకుండా చెరువు కట్టకు బలం చేకూర్చే మర్రి చెట్టును కొందరు నరికి వేశారని, ఇరిగేషన్ అధికారులకు అదే గ్రామానికి చెందిన రైతు గోగూరి శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు చేశాడు. అయితే, ఆదివారం అధికారులు సెలవుల్లో ఉంటారని తెలిసి ఇరిగేషన్ అధికారులకు సమాచారం ఇచ్చాడు. చెరువులో మట్టిపోసి దున్నుతున్న రైతును వివరణ అడిగితే తాను మండలంలోని కాంగ్రెస్ నాయకుడికి, చెప్పి దున్నుతున్నట్లు తెలపడంతో చెరువు కబ్జా చేసే అధికారం అతనికి ఎక్కడిదని గ్రామస్తులు ప్రశ్నించారు. ఇదే విషయాన్ని నీటి పారుదల శాఖ అధికారులకు సమాచారం ఇవ్వగా ఏఈ భాస్కర్‌రెడ్డి అక్కడికి చేరుకుని పరిశీలించారు. నీళ్లు లేని సమయంలో ఏక్‌పసల్ పంట వేసుకోవచ్చని, కానీ చెరువులో అచ్చుకట్టడం నేరమే అవుతుందని వివరణ ఇచ్చాడు. వెంటనే చెరువులో పోసిన అడ్డుకట్టను తొలగించాలని రైతుకు సూచించారు. చెరువులో ఎలాంటి పంట వేయకూడదని, వేస్తే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. అలాగే, కట్టపై కొందరు నరికివేసిన చెట్ల విషయాన్ని రైతు ఏఈకి తెలుపగా, అది తమ పరిధి కాదని ఏఈ బదులిచ్చారు. చెట్ల రక్షణకు బాధ్యులెవరో చెప్పాలని రైతు గోగూరి శ్రీనివాస్‌రెడ్డి ఏఈని నిలదీశారు.



రుద్రంగి పోలీస్ స్టేషన్ దగ్గర ప్రమాదకరంగా ఉన్న అప్రోచ్ రోడ్డు

## 'దారి'ద్ర్యం వీడేనా..?

- రుద్రంగిలో అధ్వానంగా అప్రోచ్ రోడ్లు
- అసంపూర్తి పనులతో ప్రజల అవస్థలు
- ప్రమాదాలు జరుగుతున్నా పట్టని అధికారులు



రుద్రంగి బస్‌స్టాండ్ ఏరియాలో ప్రమాదకరంగా ఉన్న అప్రోచ్ రోడ్డు

రుద్రంగి, డిసెంబర్ 22 : రుద్రంగిలో అప్రోచ్ రోడ్లు అధ్వానంగా మారాయి. అసంపూర్తి పనులతో ప్రమాదకరంగా మారాయి. రుద్రంగి మండల కేంద్రంలో కొద్దిరోజుల క్రితం ఆర్అండ్‌బీ ప్రధాన రహదారి విస్తరణతో పాటు సైడ్ డ్రైనేజీ పనులు పూర్తయ్యాయి. అయితే గతంలో ఉన్న రోడ్డును కొత్తగా రెండు మీటర్ల ఎత్తున నిర్మించారు. దానికి అనుసంధానంగా ఉన్న దాదాపు 30 అప్రోచ్ రోడ్ల వెంట మట్టి పోసి రివిట్‌మెంట్ నిర్మించకుండా వదిలేయడంతో ప్రమాదకరంగా మారాయి. అయితే ప్రధాన రహదారిని రెండు మీటర్లు ఎత్తున నిర్మించడంతో కాలనీలన్నీ డౌన్ అయ్యాయి. బస్టాండ్ ఏరియా, మండల పరిషత్ కార్యాలయం, లక్ష్మీ నరసింహస్వామి అలయం ఎదుట దాదాపు 3 మీటర్ల మేర రోడ్డు ఎత్తు పెంచడం ఇబ్బందిగా మారింది. కాలనీల నుంచి ప్రధాన రహదారికి బైక్‌పై వచ్చి, వెళ్లే క్రమంలో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇటీవల పలువురికి గాయాలైన సందర్భాలు ఉన్నాయి. ప్రధాన రోడ్డు పనులు పూర్తయి నెలలు గడుస్తున్నదని, అప్రోచ్ రోడ్డు వెంటనే నిర్మించాలని అధికారులకు, ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, సీసీ రోడ్లు వేయాలని కోరుతున్నారు.